# ఇంటర్ పరీక్షలు ప్రారంభం









కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్ధిపేట జిల్లా కేంద్రంలో బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ముఖ్యంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల రద్దీ ఎక్కువగా కనిపించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్లు, రూమ్ నంబర్లు, పరీక్షా విధివిధానాలను ముందుగానే తెలుసుకుని క్రమపద్ధతిలో లోపలికి ప్రవేశించారు.

కొందరు తమ తల్లిదండ్రులతో కలిసి రాగా.. మరికొందరు ఆటోల్లో కేంద్రాలకు చేరుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఈ పరీక్షలు మొదలయ్యాయి. కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలనే ఆకాంక్షతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాశారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు!

వాంకిడి మండలంలో బ్లాక్ స్పాట్స్ పరిశీలించిన ఎస్పీ నితికా పంత్

ప్రమాదకర ప్రాంతాల్లో సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటుకు ఆదేశాలు

సమన్వయంతో పనిచేసి ప్రమాదాలు తగ్గించాలని సూచన

**తుడు జితేందర్ - జనం పవర్- ఉత్తర తెలంగాణ బ్యూరో**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల పరిధిలోని ఇందాని, గణేష్ పూర్, సోనాపూర్, వాంకిడి, కమాన ఎక్స్ రోడ్ బ్లాక్ స్పాట్స్ ను జిల్లా ఎస్పీ నితికా పంత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఏ ఐ అధికారులతో పాటు పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా వాహనాలు నడిపేలా అవసరమైన ప్రాంతాల్లో స్పష్టమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో సోలార్ లైటింగ్, రోడ్ బంప్స్ నిర్మించాలన్నారు. రోడ్డు భద్రతా సూచికలు, స్పీడ్ లిమిట్ హెచ్చరికలతో పాటు రిఫ్లెక్టివ్ మార్కింగ్స్ సమర్థవంతంగా అమలు చేయాలని, తద్వారా వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించే అవకాశం ఉంటుందని వివరించారు. రోడ్డు మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజల్లో అవగాహన పెంపొందించడం కూడా ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ శాఖ, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రమాదాలను గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, వాంకిడి సీఐ సత్యనారాయణ, డీసీఆర్ బీ ఇన్స్పెక్టర్ శ్రీధర్, వాంకిడి ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

# అక్షర మాఫియా అంతం దిశగా

# ఆపరేషన్ దుర్యోధన

## జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి అక్రమ సామ్రాజ్యంపై సమరం

- సైకిల్ స్థాయి నుంచి కోట్లాది రూపాయల పడగ
- వార్తల పేరుతో అధికారులు, సామాన్యుల పీడింపు
- విజన్ పాఠశాల పేరుతో విద్యార్థులకు మోసం
- అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నిరూపిస్తానన్న జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో చీఫ్ తుడుం జితేందర్



**తుడు జితేందర్ - జనం పవర్- ఉత్తర తెలంగాణ బ్యూరో**

జర్నలిజం ముసుగులో సాగుతున్న ఒక అక్రమ సామ్రాజ్యం పునాదులు కదులుతున్నాయి. పేపర్ బాయ్ నుంచి కోటీశ్వరుడి వరకు సాగిన ఒక వ్యక్తి ప్రస్థానం వెనుక ఉన్న చీకటి కోణాలను ఆపరేషన్ దుర్యోధన బట్టబయలు చేస్తోంది. జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలివేరి నరసయ్య అక్రమాలపై బాధితులు, ప్రజా సంఘాలు గళమెత్తడంతో మండలంలో ఉత్కంఠ నెలకొంది. రెండు దశాబ్దాల క్రితం సైకిల్ పై ఇంటింటికీ పేపర్లు వేసిన ఒక సాధారణ వ్యక్తి, నేడు కోట్లాది రూపాయల ఆస్తులకు అధిపతి ఎలా అయ్యారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. జన్నారం కేంద్రంలోనే నాలుగు భారీ భవనాలు, అక్రమంగా సంపాదించిన సాగు భూములు, ఖాళీ ప్లాట్లు ఆయన సొంతం. నెలకు ముప్పై వేల ఆదాయం ఉన్న వ్యక్తి ముప్పై ఏళ్లలో గరిష్ఠంగా యాభై నుంచి అరవై లక్షలు దాచుకోగలడు. కానీ, నరసయ్య ఆస్తులు ఆ అంచనాలకు వేల రెట్లు ఎక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది.

నరసయ్య నాయకత్వంలో ఒక ముఠా ఏర్పడి అధికారులను, సామాన్యులను పీడిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల చిన్న పొరపాట్లను భూతద్దంలో చూపిస్తూ, వార్తలు రాస్తామని బెదిరించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని సమాచారం. భూ వివాదాల్లో తలదూర్చి, అండలేని అమాయకుల భూములను బెదిరించి తన పేరు మీదకో లేదా బినామీల పేరు మీదకో మార్చుకోవడం, తనను ప్రశ్నించిన వారిపై వ్యవస్థీకృత బలాన్ని ఉపయోగించి తప్పుడు కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. నరసయ్య అక్రమాల్లో ఆయన కుమారుడి పాత్ర కూడా తక్కువేమీ కాదని స్థానికులు మండిపడుతున్నారు. నరసయ్య కుమారుడు సుధీర్ కరోనాకు ముందు విజన్ పేరుతో స్కూల్ పెట్టి, మాయమాటలతో విద్యార్థులను చేర్పించుకున్నారు. రెండేళ్లకే స్కూల్ మూసివేయడంతో, ఇప్పుడు ఆ విద్యార్థులకు బోనఫైడ్, టీసీ వంటి కీలక పత్రాలు దొరకడం లేదు. విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెట్టి తండ్రీకొడుకులు సొమ్ము చేసుకున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై జనం పవర్ పత్రిక ఉత్తర తెలంగాణ బ్యూరో చీఫ్ తుడుం జితేందర్ అక్రమాలను వెలుగులోకి తెస్తూ నరసయ్యకు బహిరంగ సవాల్ విసిరారు. తాను రాసే ప్రతి అక్షరం నిజమని, పక్కా ఆధారాలతో కవ్వాల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నిరూపిస్తానని స్పష్టం చేశారు. ఒకవేళ అబద్ధాలని నిరూపిస్తే పత్రిక నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులపై ఏసీబీ విచారణ జరపాలని, పత్రికా రంగానికి మచ్చ తెస్తున్న వారిని వెంటనే తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. బాధితుల దగ్గర నుంచి వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇప్పించాలంటున్నారు. అక్షరాన్ని ఆయుధంగా మలచుకుని అక్రమాలకు పాల్పడే బ్లాక్ మెయిలింగ్ మాఫియాకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ చరమగీతం పాడాలని జన్నారం ప్రజలు కోరుతున్నారు.

# కందిలో నూతన బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠ!

రోడ్డు విస్తరణలో పాత విగ్రహం తొలగింపు

కొత్త విగ్రహం ఏర్పాటుకు యాజమాన్యం హామీ

వెల్లడించిన వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షులు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 25 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న బసవేశ్వర విగ్రహాన్ని తొలగించాల్సి వచ్చింది. దానికి ప్రత్యామ్నాయంగా మూడు లక్షల రూపాయల విలువ గల నూతన బసవేశ్వర విగ్రహాన్ని జాతీయ రహదారి (ఎన్ హెచ్ – 65) పక్కన కేటాయించిన స్థలంలో ప్రతిష్ఠించి అందజేస్తామని సంబంధిత యాజమాన్యం హామీ ఇచ్చింది.

ఈ విషయాన్ని వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కంది మాజీ సర్పంచ్ బుగ్గన గారి వీరేశం, యువజన అధ్యక్షులు బుగ్గన గారి మల్లికార్జున్, బుగ్గన గారి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.




# కల్లేపల్లి కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ఉచితంగా కంటి పరీక్షలు చేసిన వాసన్ ఐ కేర్ ఆసుపత్రి

రోగులకు తగిన సలహాలు, సూచనలు అందజేసిన వైద్య సిబ్బంది

శిబిరంలో పాల్గొన్న సర్పంచ్, గ్రామస్తులు

**బెజ్జంకి, ఫిబ్రవరి 25 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని కల్లేపల్లి గ్రామంలో బుధవారం వాసన్ ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి వారికి తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిగుళ్ల మోహన్, ఉప సర్పంచ్ బుర్ర శశి వినీత్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, వార్డు సభ్యులు మహంకాళి మోహన్, నీసాని అనిల్, ఒగ్గు కనకయ్య, వెదిరే సతీష్, పంచాయతీ కారోబార్ స్వామి, రాకేష్, వినయ్ గౌడ్, ప్రేమ్, లక్ష్మణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి రాజ్యం!

- తెలంగాణ వజ్రోత్సవాల నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరపాలి
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త చక్రధర్ గౌడ్
- ఏసీబీ విచారణ నత్తనడకన సాగడంపై అనుమానాలు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి రాజ్యం ఏలుతోందని సామాజిక కార్యకర్త గాధగోని చక్రధర్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ జాతీయ వజ్రోత్సవాల సందర్భంగా జరిగిన నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెరుగు మంజుల రాజనర్సుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అవినీతి ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ద్వారా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా చక్రధర్ గౌడ్ మాట్లాడుతూ.. వజ్రోత్సవ వేడుకల్లో ఏడున్నర లక్షల నిధుల గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై ఏసీబీ విచారణ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. మున్సిపల్ బాక్స్ టెండర్ల పేరిట చైర్‌పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజా ధనాన్ని దారి మళ్లించి జేబులు నింపుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అవినీతిపై ప్రతిపక్ష పార్టీల నాయకులు మౌనం వహించడం శోచనీయమని విమర్శించారు. మున్సిపల్ అవినీతిలో భాగస్వామ్యులైన అధికారులు, రాజకీయ నాయకులపై రాజీలేని పోరాటం కొనసాగిస్తానని చక్రధర్ గౌడ్ స్పష్టం చేశారు. అయితే, ఈ ఆరోపణలపై మున్సిపల్ అధికారుల స్పందన ఇంకా వెలువడాల్సి ఉంది.

